క్లుప్తంగా

పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో విజయ కుమారి సూచించారు. రాజేంద్రపాలెంలో అంగన్‌వాడీ వర్కర్లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులను వర్కర్లు విధిగా పర్యవేక్షించాలని కోరారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముందుగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

చింతపల్లి/ గూడెం కొత్తవీధి: గూడెం కొత్తవీధి మండలంలో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీకే వీధి మండల కేంద్రంతో పాటు సప్పర్ల, దారకొండ, దుప్పిలవాడ పంచాయతీ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసుల స్వచ్ఛభారత్



పోలీసు స్టేషన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

చింతపల్లి: చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల 3వ శనివారం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాలు మేరకు సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లోపల, ఆవరణలను పరిశుభ్రం చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎర్రగొండమ్మ తల్లి ఉత్సవాలు



కొయ్యూరు: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరున్న ఎర్రగొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం నుంచి 23 వరకు జరగనున్నాయి. అనేక గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి విచ్చేస్తారు. మండలంలో అనేక గ్రామాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు రానున్నట్టు నిర్వాహకులు తెలిపారు..వారి మొక్కులు చెల్లించుకుంటారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

గ్రామాల్లో ఉపాధి పనులు



కించుమండలో భూమి చదును పనులు చేస్తున్న గిరిజనులు

దుంబ్రిగుడ: మండలంలోని ఉపాధి పనులు ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా గిరిజనులు ఉపాధి హామి పథకం ద్వారా నిర్వహిస్తున్న పనుల్లో గిరిజనులు నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల్లో ఎక్కువగా రాతికట్లు, భూమి చదును, చెరువులు, కందకాలువలు వంటి పనులు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 12 వేల మంది గిరిజనులు జాబ్ కార్డులు కలిగి ఉండి ఆయా పనులను చేస్తున్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

పాడేరు రూరల్: మండలంలో సలుగు పంచాయతీ కక్కి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం జల్‌జీవన్ మిషన్ నుంచి మంజూరైన తాగునీరు బోరు నిర్మాణ పనులకు సర్పంచ్ అప్పలకొండ, ప్రజాప్రతినిధులు కలిసి శనివారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు బోరును గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో తాగునీరు లేని గ్రామాలను గుర్తించి బోర్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మీనా, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగరాజు, వార్డు సభ్యులు శ్రీనివాసరావు, మాజీ వార్డు సభ్యులు ఈశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆశల సాగు



సంతలో వేరుశనగ విక్రయాలు



పెదబయలులో వేరుశనగ పంట

వేసవి పంటగా వేరుశనగ

వాణిజ్య పంటల సాగుకు గిరిజన రైతుల ఆసక్తి

పెదబయలు: గిరిజన ప్రాంత రైతులు సంప్రదాయ పంటలే కాకుండా వాణిజ్య పంటల సాగు చేస్తున్నారు. గతంలో కేవలం వర్షాధారంపై ఆధారపడి పసుపు. పిప్పళ్ల ఇతర అపరాల సాగు చేసే రైతులు ప్రస్తుతం తక్కువ కాలంలో పంట చేతికంది ఎక్కువ లాభ సాటి కలిగిన పంటలు సాగు చేస్తున్నారు. మండలంలోని సీతగుంట, అరడకోట, అడుగులుపుట్టు, గలగండ, గంపరాయి, ముంచంగిపుట్టు మండలం దారెల, పెదగుడ, ఏనుగురాయి, మాకవరం, దోడిపుట్టు పంచాయతీల్లో ఎక్కువగా వాణిజ్య పంటలు వేరుశనగ ఎక్కువగా సాగుచేస్తున్నారు. గతేడాది 30 కిలోల బస్తా రూ.1700 నుంచి రూ.2100 వరకు విక్రయించారు. మన్యంలో పండించే వేరుశనగలకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు గత ఆరేళ్ల నుంచి ఎక్కువగా సాగు చేస్తున్నారు. మండలంలోని సీతగుంట, అడుగులపుట్టు, అరడకోట, గలగండ, గంపరాయి పంచాయతీల్లో వందల ఎకరాల్లో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. గతంలో కంటే రైతులు అవకాశాలు సద్వినియోగం చేసుకుని పంట సాగు చేస్తున్నారు.



పెదబయలు మత్స్యగెడ్డ ప్రాంతంలో వేరుశనగ సాగు

వాతావరణం అనుకూలం



వేరుశనగల పంట బాగుంది. దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మరో రెండు నెలల్లో పంట తీయడం జరుగుతుంది.గత ఏడాది ధర బాగానే ఉంది. ఈ ఏడాది ఇంకా పెరిగే అశకాశం ఉందని ఆశగా ఉంది. ఈ ఏడాది ఈ నెలలోనే వర్షాలు పడుతుండడంతో సాగుకు అనుకూలంగా ఉంది.

– పాంగి రాజు, రైతు, సీతగుంట పంచాయతీ, పెదబయలు మండలం

90 రోజుల వేసవి పంటకు రైతుల ఆసక్తి



మండలంలో ఎక్కువగా మత్స్యగెడ్డను ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీల్లో ఎక్కువగా వేరుశనగ సాగు చేస్తున్నారు. 90 రోజుల వేసవి పంట కావడంతో స్థానికంగా నీటి వనరులకు సద్వినియోగం చేసుకోవడం, ప్రస్తుతం మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆశక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం పంట మొక్క దశలో ఉంది. కొంత మంది రైతులు సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. రైతులు వాణిజ్య పంటల సాగుపై మక్కువ చూపిస్తున్నారు.

– ఎ.శ్రీనివాస్, ఏవో, పెదబయలు మండలం

పాఠశాల భవనం నిర్మించాలని ఆందోళన



పాఠశాల కోసం డిమాండ్ చేస్తున్న గ్రామస్తులతో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి శంకర్

దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ చంపాపట్టి గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ఎం.శంకర్, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఈదురుగాలులకు ఎగిరిపోయిన చంపాపట్టి పాఠశాల పైకప్పు ప్రమాదకరంగా తయారైందని తెలిపారు. శనివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు వరండాలో చదువుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాల సెలవు కావడంతో పెనుప్రమాదం తప్పిందని, వర్షం కారణంగా పాఠశాల గోడలు పూర్తిగా నానిపోయి పడిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. నాయకుడు విజయదశమి, గ్రామస్తులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



చిన్నారి కుటుంబ సభ్యునికి రక్తం అందజేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాడేరు రూరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, సంయుక్తంగా నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్ సేవలు అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న 12 నెలల బాలుడు గోచారి నియాన్‌కు ఓ పాజిటివ్ రక్తం అత్యవసరం వచ్చింఇ.ఈ మేరకు శనివారం బాలుడు బంధువులు స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించారు. ఈమేరకు సొసైటీ ప్రతినిధులు తక్షణమే స్పందించి ఉచితంగా రక్తం అందజేసి చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. ఈ మేరకు చిన్నారి బంధువులు తదితరులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ రెస్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గౌరిశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇటుకల పండగ సందడి



ముంచంగిపుట్టులో తాచేరు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

ముంచంగిపుట్టు: మండలంలో పలు గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి నెలకొంది.గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం శంకుదేవునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మగవారంతా వేట కోసం అటవీ బాట పట్టగా, మహిళలంతా గ్రామాలకు వచ్చే దారిపొడవునా కర్రలు, తాడులు అడ్డుపెట్టి తాచేరు(చందా) వసూలు చేస్తున్నారు. వేడుకలో భాగంగా మండలంలోని ఏనుగురాయి, వనభసింగి, చోటముక్కిపుట్టు, కొండపడ, లుంగాపుట్టు, కిలగాడ, కొత్తురు, పాలిపుట్టు, పనసపుట్టు, ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం ప్రధాన రహదారి అంతా తాచేరు వసూలు సందడి కనిపించింది. డబ్బులు ఇచ్చిన వారిని విడిచి పెడుతూ ఇవ్వని వారిపై నీళ్ల పోస్తూ ఇటుకల పండుగను గిరిజనులు ఎంతో సంబరంగా జరుపుకుంటున్నారు. జోలాపుట్టు నుంచి మండల కేంద్రం మీదుగా కుంజభంగి వెళ్లే మార్గంలో 68 చోట్ల తాచేరు వసూలు గెట్లు ఉండడం విశేషం.

కాఫీ కార్మికుల సమస్యలపై వినతి



చింతపల్లిలో ధర్నా చేస్తున్న కార్మికులతో సీఐటీయూ నాయకుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: ఆంధ్రప్రదేశ్ కాఫీ అబివృద్ధి సంస్థ(ఏపిఎఫ్‌డిసి)లో అపరిష్కృతంగా ఉన్నటువంటి కాఫీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడుబోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ఏపీఎఫ్‌డీసీ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికుల సమస్యలపై డివిజన్ స్థాయి అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎఫ్‌డీసీ చింతపల్లి, గూడెం కొత్తవీధి, పాడేరు డివిజన్ పరిధిలో గల కార్మికుల అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఐదు నెలల క్రితం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందని అయితే నేటి వరకూ ఎటువంటి పరిష్కారం చూపకపోవడంతో కార్మికులు, దిగువస్థాయి ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కార్మిక సమస్యలపై కాఫీ అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయంగా ఈ ప్రాంత కాఫీకి గుర్తింపు లభిస్తున్నా కార్మికులకు కనీస గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కనకవల్లి తదతరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమలమందు పిచికారీ



మెట్టరామవరంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

కూనవరం: మలేరియా ప్రశావిత గ్రామాల్లో సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఐఆర్‌ఎస్ కార్యక్రమం ప్రారంభమైందని కూనవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజీవ్ తెలిపారు. మండలంలో మెతరామవరం ,పాలగూడెం గ్రామాల్లో శనివారం ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేయించినట్టు తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సోకకుండా దోమల మందు పిచికారీ ఎంతో దోహద పడుతుందన్నారు. మలేరియా ప్రబావితం ఎక్కువగా ఉన్న గ్రామాల్లో అల్ఫా సైబర్‌మిత్రిన్ మందును ఇంటిలోపల, బయట పిచికారీ చేయించామన్నారు. మండలంలోని బోదునూరు, కన్నాపురం, భైరవపట్నం, రామచంద్రాపురం, పైదిగూడెం తదితర గ్రామాల్లో దోమలమందు పిచికారీ కార్యక్రమం నిర్వహించామన్నారు. దోమల మందు పిచికారీ సమయాల్లో ఇంట్లో ఉన్న సామాన్లు బయట పెట్టి పిచికారీ అనంతరం సామాన్లు ఇంట్లోకి సర్దుకొని తమ సిబ్బందికి సహకరించాలని డాక్టర్ రాజీవ్ కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు రామకృష్ణ, ఏఎన్‌ఎం దివ్యభారతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై అధికారులను నిలదీయాలి

పెదబయలు: గిరిజన ప్రాంతంలో అక్రమ కట్టడాలపై పాడేరు ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో అధికారులను నిలదీయాలని డీఎల్‌వో జిల్లా అధ్యక్షుడు కిముడు కొత్తయ్య అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగంలో ఐదో షెడ్యూల్ ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరపడానికి వీలులేదన్నారు. ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు ఏడాదికి రెండు, మూడు జరగాల్సి ఉండగా ఏళ్ల తరబడి జరగడం లేదన్నారు. త్వరలో జరగనున్న పాలక వర్గ సమావేశంలో ప్రశ్నించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సదుపాయాలు లేవని, మెనూ అమలు కావడం లేదని, రక్తహీనత పలు వ్యాధులతో విద్యార్థులు మృత్యువాత పడుతున్నారన్నారు. జిల్లా ఐఏఎస్ అధికారులు చలి ఉత్సవాలు నిర్వహించి డ్యాన్సులు వేస్తున్నారని, గిన్నిస్ బుక్ రికార్డుల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు పాలక వర్గ సమావేశంలో గొంతు వినిపించాలని కోరారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

అడ్డతీగల: అపోలో ఫార్మసీలో ఉద్యోగ నియామకాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. అడ్డతీగలలో త్వరలో అపోలో ఫార్మసీ ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఫార్మసిస్టు పోస్టులు రెండు ఉన్నాయన్నారు.వాటి నియామకానికి బీడీఎం ఫార్మసీ, పీసీఐ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులు మూడు ఉన్నాయని, దీనికి పదో తరగతి ఆపై చదివిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఈ రెండు రకాల పోస్టులకు అర్హత కలిగిన యువత ఈ నెల 30 లోగా దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలన్నారు.

నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు నరసింహారావు

వి.ఆర్.పురం: సర్వం కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధలా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు సింగు నరసింహారావు అన్నారు.వి.ఆర్.పురం, కూనవరం మండల పార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది మరొకటిగా ఉందన్నారు. పునరావాసం, పరిహారం ఆర్‌అండ్ ఆర్ ప్యాకెజీ ప్రతి ఒక్క నిర్వాసితుడికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది పేర్లను జాబితా నుంచి తొలగించారని వారిని తిరగి చేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ చట్టంలో నిర్వాసితుడే తొలి లబ్ధిదారుడు కావాలని ఉన్నా ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో గిరిజన నిర్వాసితులకు స్థానికంగా స్థలాలు మంజూరు చేయాలన్నారు. మోహన్‌రావు, శ్రీనివాసురావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, కృష్ణార్జునరావు, వెంకటేశ్వర్లు, ముత్యం, గణపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనర్థాలు



డుంబ్రిగుడలో విద్యార్థుల ర్యాలీ



బొడ్డాపుట్టులో ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేష్



కూనవరంలో అటవీశాఖ అధికారులు సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు



పాడేరులో అవగాహన ర్యాలీలో అధికారులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది



వేటమామిడిలో మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు తదితరులు



చింతూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ: జిల్లాలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరిపారు. పారిశుధ్యం మెరుగునకు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను విద్యార్థులకు వివరించారు. మొక్కలు నాటారు. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్మూలించాలని భారీ ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, హెచ్ఎంలు. ప్రిన్సిపాళ్లు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ కారణంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్మూలించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వీడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని బొడ్డాపుట్టు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పెదబయలు అటవీ రేంజ్ అధికారి కె.వి.రాజేష్ స్థానికులకు ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేశారు. సిబ్బంది సృజన తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఈశ్వరరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రసూల్, అధ్యాపకులు గౌరీశంకర్, కోటేశ్వరరావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డి.చిన్నబాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్, ఆస్పత్రి కౌన్సెలర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు, తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సురేష్, అనిల్ కుమార్, సాయి వెంకటరమణ, విజయలక్ష్మి, జంపన్నరాజు, సుబ్బయ్య, రమేష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ఎఫ్‌బీవో దుర్గా భవాని గీసిన చిత్రం పలువురిని ఆలోచింపజేసింది

చింతూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్లు రమణారావు, సాయికిషోర్‌రెడ్డి, జ్యోష్ణప్రియ, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు తప్పడు ప్రచారాలు మానుకోవాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గంగవరం: వైఎస్సార్‌సీపీ నేతలపై మండల కూటమి నాయకులు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు మానుకోవాలని, పార్టీ రంపచోడవరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాతపూడి ప్రకాశరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ - 2 కుంజం గంగాదేవి, నెల్లిపూడి ఎంపీటీసీ సభ్యులు పి.కనకలక్ష్మి సర్పంచ్‌లు కుంజం లక్ష్మి, మరిడమ్మ, కామరాజు దొర, హితవు పలికారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాతపూడి ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 16న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో గంగవరంలో జరిగిన వైఎస్సార్‌సీపీ సమావేశానికి భారీగా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడంతో కూటమి నాయకులు జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొల్లేరుకు చెందిన పాము అర్జున అనే వ్యక్తి తన పైన, తమ నేత ఎమ్మెల్సీ అనంతబాబు పైన తప్పుడు ఆరోపణ చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకుంటే మంచిదన్నారు. సర్పంచ్‌లు లక్ష్మి, కామరాజు, మరిడమ్మ, నాయకులు యేసు, బాబ్జి, అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



థింసా నృత్యం చేస్తున్న చిన్నారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు మత్స్యరాజు, చిరంజీవులు, యాజమాన్య సభ్యురాలు రోజా కిరణ్, ఐద్వా నాయకురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తప్పని తిప్పలు



లాగరాయిలో మండుటెండలో కుళాయి వద్ద మహిళలు

రాజవొమ్మంగి: లాగరాయి గ్రామం, కోయవీధిలో తాగునీటికి కటకట ఏర్పడింది. తాగునీరు సక్రమంగా అందక నానా ఇబ్బంది పడుతున్నామని గ్రామానికి చెందిన అమరేష్‌గాంధీ, శాంతి అన్నారు. కాలనీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్‌మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే అవి కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. చేతి బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోందంటున్నారు. బోరు ద్వారా నీరు తక్కువగా వస్తుండడంతో బిందె నీటి కోసం మండుటెండలో గంటలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సర్పంచ్ గనిలక్ష్మిని, పంచాయతీ కార్యదర్శి వరహాలు మాట్లాడుతూ ఈ వీధికి రూ. 22 లక్షలతో నూతన తాగునీటి పథకం మంజూరైందన్నారు. ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యను వారంలోగా పరిష్కరిస్తామన్నారు.